వైభవంగా సుదర్శన నారసింహ హోమం

సువర్ణ పుష్పార్చనలో హారతి ఇస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, ఆగస్టు 21 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ప్రధానాలయంలో సుదర్శన నారసింహ హోమం అత్యంత వైభవంగా జరిగింది. బుధవారం ప్రధానాలయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతు జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు కొనసాగాయి. సుమారు 9వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.14,87,635 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. స్వామివారిని మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ వేర్వేరుగా దర్శించుకుని పూజలు చేశారు.

రీజినల్ రింగ్ రోడ్డు బాధితుల ఆందోళన

తాసీల్దార్‌తో మాట్లాడుతున్న ప్లాట్ల బాధితులు

చౌటుప్పల్, ఆగస్టు 21 : పట్టణంలోని జయభూమి హెచ్ఎండీఏ వెంచర్‌లో రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించిన అధికారులు బుధవారం సర్వే చేపట్టారు. అందులో ప్లాట్లు కోల్పోతున్న బాధితులు ఆందోళనకు దిగారు. కొద్దిసేపు సర్వేను అడ్డుకున్నారు. పోలీసులు జోక్యం చేసుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం అక్కడకు వచ్చిన తాసీల్దార్ హరికృష్ణ వద్దకు వెళ్లి లక్షల్లో అప్పులు చేసి ప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. మొదట రీజినల్ రింగ్ రోడ్డు 150 ఫీట్ల అవతల వైపు అనే ప్రతిపాదనతోనే ఇక్కడ ప్లాట్లు తీసుకున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తిరిగి రెండో ప్రతిపాదన తేవడం సరైంది కాదన్నారు. తమ ప్లాట్లకు 30-40 ఫీట్ల దూరం తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తాసీల్దార్ చెప్పడంతో ఆందోళన విరమించారు. నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని బాధితులు హెచ్చరించారు.

గ్రామపంచాయతీ సెక్రటరీల ఫోరం జిల్లా నూతన కమిటీ

నూతన కార్యవర్గానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా ఉద్యోగ జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, ఆగస్టు 21 : గ్రామపంచాయతీ సెక్రటరీల ఫోరం జిల్లా నూతన కార్యవర్గాన్ని పట్టణంలోని ఓ హోటల్లో జిల్లా ఉద్యోగ జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి, కన్వీనర్ నందిల్ల బలరాం సమక్షంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.శశికాంత్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్లుగా ఇ.ఉపేశ్, ఎండీ జకీరొద్దీన్, పాల్వాయి రమాదేవి, సెక్రటరీలుగా కె.సిద్ధేశ్వర్, జె.శ్రీనివాస్, ఎండీ మున్నావర్, ఎల్.వెంకటరమణ, పి.కవిత, ట్రెజరర్‌గా మెరుగు సత్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బొట్ల శ్రీకాంత్, ఎంఏ ఖదీర్, స్పోర్ట్స్ సెక్రటరీగా సీహెచ్ నవీన్, ఆఫీస్ సెక్రటరీగా డి.రమాకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ఆర్.వెంకటేశ్వర్, వి.సత్తిరెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు డి.భగత్, ఎన్నికల అధికారిగా ఎండీ ఖదీర్ వ్యవహరించారు.

దివీస్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 21 : దివీస్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకొని బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన బాధిత రైతులతో కలిసి బుధవారం కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతిపత్రం అందజేశారు. దివీస్ కంపెనీ వల్ల రైతులకు జరుగుతున్న నష్టాన్ని వివరించారు. వ్యర్థ రసాయనాలతో వస్తున్న బోరు నీళ్లను కలెక్టర్‌కు చూపించారు. క్షేత్రస్థాయిలో పరిశీలనకు రావాలని కోరారు. స్పందించిన కలెక్టర్ రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ దివీస్ కంపెనీ వల్ల ఏటా లక్షల రూపాయల విలువ చేసే పంటలను, పశు సంపదను స్థానిక రైతులు నష్టపోతున్నారన్నారు. వ్యర్థ రసాయనాల వల్ల పంటలు మాడి మసైపోతున్నాయని, ఈ నీళ్లు తాగిన పశువులు చనిపోతున్నాయని తెలిపారు. విష వాయువులను, వ్యర్థ రసాయనాలను ఆపడానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత రైతులకు ఎకరానికి రూ.50వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, బాధిత రైతులు పాల్గొన్నారు.

'నూనెగూడేన్ని రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలి'


నాయబ్ తాసీల్దార్ నీలిమకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

గుండాల, ఆగస్టు 21 : నూనెగూడెం గ్రామాన్ని ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. బుధవారం పలువురు గ్రామస్తులు గ్రామం నుంచి ప్లకార్డులతో తాసీల్దార్ కార్యాలయానికి పాదయాత్రగా వచ్చి నాయబ్ తాసీల్దార్ ఎన్.నీలిమకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామం 35 ఏండ్ల క్రితమే ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు అయినప్పటికీ నేటికీ గుండాల రెవెన్యూ పరిధిలోనే కొనసాగుతుందన్నారు. తమ గ్రామానికి సంబంధించిన రెవెన్యూ రిజిస్ట్రేషన్ చార్జీలు గుండాలకు వెళ్తున్నట్లు తెలిపారు. నూనెగూడెం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు గుండాల - నూనెగూడెం గ్రామాల మధ్య వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మద్దెపురం రాజు, ఆలేటి మల్లారెడ్డి, మాధవరెడ్డి, నాగిరెడ్డి, దివాకర్‌రెడ్డి, సోమిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, షబ్బీర్, రాజశేఖర్, అనిల్, ప్రవీణ్, మహేశ్, శేఖర్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

డీసీసీబీ టర్నోవర్ రూ.3వేల కోట్లకు పెంచడమే లక్ష్యం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.280కోట్ల రుణ మాఫీ
- డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 21 : ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 89వేల మంది రైతులు రుణాలు తీసుకున్నారని, అందులో 52,700 మంది రైతులకు రూ.280 కోట్ల రుణమాఫీ జరిగిందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులకు త్వరలోనే మాఫీ చేస్తామని తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కో ఆపరేటివ్ బ్యాంకులు కమర్షియల్ బ్యాంకులకు దీటుగా పని చేస్తున్నాయన్నారు. రూ.25వేల కోట్ల టర్నోవర్‌లో ఉన్న డీసీసీబీని రూ.3వేల కోట్ల టర్నోవర్ పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. బ్యాంకుల ద్వారా రైతులు ఇంటి నిర్మాణానికి రూ.30లక్షలు, విదేశీ విద్యకు ఎకరానికి రూ.5లక్షలు, సొంతంగా వ్యాపారం చేయాలనుకున్న యువతకు రూ.2కోట్ల సబ్సిడీ లోన్లు ఇస్తున్నామని, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన నారాయణపురం పీఏసీఎస్ భవనం స్థానంలో రూ.80లక్షలతో నూతన భవనం నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్, నూతన భవన నిర్మాణం పనులను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నారాయణపురం పీఏసీఎస్ అభివృద్ధిలో దూసుకుపోతుందని, అభివృద్ధికి సహకరిస్తున్న చైర్మన్ జక్కిడి జంగారెడ్డి, సిబ్బందిని ఆయన అభినందించారు. పీఏసీఎస్ చైర్మన్లు జక్కిడి జంగారెడ్డి, యాదిరెడ్డి, డైరెక్టర్లు గాలయ్య, పెంటయ్య, నాయకులు సతీశ్, బాలకృష్ణ, చంద్రారెడ్డి, నర్సింహ, రమేశ్ బాబు, నాగరాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి : బీఆర్ఎస్

ఆత్మకూర్(ఎం) : కూరెళ్లలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఉప్పలయ్య

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 21 : అర్హులైన రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాషబోయిన ఉప్పలయ్య అన్నారు. మండలంలోని కూరెళ్ల గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు రైతులందరికీ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. మండలంలో సగం మంది రైతులకు ఇప్పటికీ రుణమాఫీ చేయకుండా మోసం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేపడుతామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎరుకల స్వామిగౌడ్, గడ్డం అశోక్, రైతు విభాగం మండలాధ్యక్షుడు పుట్ట నర్సిరెడ్డి, రమేశ్, శంకర్ పాల్గొన్నారు.

రైతులకు మద్దతుగా నేడు నిరసన

భువనగిరి అర్బన్ : ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని కోరుతూ పట్టణంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరి పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తానని చెప్పి చేయడం లేదని తెలిపారు. రైతులకు మద్దతుగా నిర్వహించే నిరసన కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రుణమాఫీ గందరగోళంపై నేడు ధర్నా

చౌటుప్పల్ : రుణమాఫీ గందరగోళంపై పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద గురువారం నిరసన చేపట్టనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి హాజరవుతారని, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రైతు ధర్నాను విజయవంతం చేయాలి

తుర్కపల్లి : పట్టణంలో గురువారం నిర్వహించనున్న రైతు ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పుడు పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయనందున నిర్వహించే నిరసన కార్యక్రమానికి మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల రైతులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రుణమాఫీ సమస్యలను పరిష్కరించాలి : రైతుసంఘం

ఏఓ ఎజాజ్ అలీఖాన్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

రామన్నపేట, ఆగస్టు 21 : మూడు దశల్లోనూ రుణమాఫీ కాని రైతుల సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు ఏఓ ఎజాజ్ అలీఖాన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో 9వేల మంది రైతులకు 4600 మందికి మాత్రమే రుణాలు మాఫీ అయ్యాయన్నారు. చాలా మంది అర్హత కలిగిన రైతులు రుణ మాఫీ కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి దరఖాస్తులను గ్రామాల్లోనే ఏఈఓల ద్వారా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, గన్నెబోయిన విజయ్‌భాస్కర్, బోయిని ఆనంద్, కల్లూరి నగేశ్, హన్మంతు, బావండ్లపల్లి బాలరాజు, రషీద్, సోములు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి : సీపీఐ

తుర్కపల్లిలో ఎస్‌బీఐ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ మండల కార్యదర్శి దుర్గయ్య

తుర్కపల్లి, ఆగస్టు 21 : రైతులకు ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో రుణమాఫీ చేయాలని మండల కేంద్రంలోని ఎస్‌బీఐ కార్యాలయం వద్ద బుధవారం సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి దుర్గయ్య మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి రుణమాఫీ కోసం వస్తున్న రైతులను బ్యాంకు అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. 2018 నుంచి 2024 వరకు రెన్యూవల్ చేయని రైతులకు కూడా రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. రైతులకు ఇబ్బందులు సృష్టించకుండా రుణమాఫీ చేయాలని, లేకుంటే రైతులతో కలిసి బ్యాంకులను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుంటిపల్లి సత్తయ్య, దాసరి బాలయ్య, భగవంత్, భూమయ్య, పకీరా పాల్గొన్నారు.

పార్థీనియం మొక్కలపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏరువాక కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ అనిల్‌కుమార్

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 21 : మండలంలోని ముత్తిరెడ్డిగూడెం, బొల్లెపల్లి, అనాజిపూర్, కూనూర్ గ్రామాల్లో రైతు వేదిక ప్రాంగణంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం, వ్యవసాయ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పార్థీనియయం మొక్కలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, శాస్త్రవేత్త కె.మమత మాట్లాడుతూ పంట పొలాల్లో, ఖాళీ స్థలాల్లో హానికరమైన పార్థీనియం మొక్కలను ఏ విధంగా నిర్మూలించుకోవాలో సూచించారు. వయ్యారిభామ అని పిలిచే ఈ మొక్కలు 1956లో అమెరికా నుంచి మన దేశంలోకి ప్రవేశించాయన్నారు. వయ్యారిభామ పుప్పడి రేణువులు గాలిలో కలువడం, ఎండిపోయిన మొక్క భాగాలు, మూలాల వల్ల అస్తమా, డెర్మటైటిస్, ఎలర్జీ వస్తాయని వివరించారు. అనంతరం పరిసరాల్లోని పార్థీనియం మొక్కలను తొలగించారు. ఏఈఓ శ్రీశైలం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి

సీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

ఆలేరు రూరల్, ఆగస్టు 21 : ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి నేరుగా ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆలేరు సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది బుధవారం సీహెచ్‌సీ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. జీతాలు టైమ్‌కు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి నేరుగా ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శానిటేషన్, ఆయుష్, ఆరోగ్యశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.

భువనగిరి గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా శ్రీశైలం

భువనగిరి సిటీ, ఆగస్టు 21 : భువనగిరి గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా రత్నపురం శ్రీశైలం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పట్నం కపిల్ అధ్యక్షతన బుధవారం గణేశ్ ఉత్సవ సమితిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 2న వినాయక చవితి, 16న నిమజ్జనం కార్యక్రమం ఉంటుందన్నారు. గణేశ్ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని, అందరూ సహకరించాలని కోరారు. త్వరలోనే కమిటీని నియమిస్తానని తెలిపారు. కార్యక్రమంలో భువనగిరి గణేశ్ ఉత్సవ సమితి గౌరవ సలహాదారులు సుర్వి శ్రీనివాస్, పట్నం కపిల్, పూస శ్రీనివాస్, కాలేరు లక్ష్మణ్, మెరుగు మధు, ఆకుల మహేందర్, బాలశంకర్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, కిషన్, కృష్ణాచారి, రవీందర్, సాయికిరణ్, మల్లేశ్, భాను, మణికంఠ, నితీశ్, రాజు పాల్గొన్నారు.

నేతాజీ గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 21 : పట్టణంలోని నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే గణేశ్ ఉత్సవాల కమిటీ అధ్యక్షుడిగా శెట్టి శ్రీనివాస్ బుధవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహిస్తామన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి అర్బన్, ఆగస్టు 21 : పట్టణంలోని విద్యానగర్‌లో కుటుంబ తగాదాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. విద్యానగర్‌కు చెందిన వంట కార్మికుడు గంగదేవి వేణుకుమార్‌రెడ్డి (42), ప్రవంతి సుమారు 12 ఏండ్ల క్రితం కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. వేణు హోటల్లో వంట కార్మికుడిగా పని చేస్తూ కొంతకాలం క్రితం నుచి సొంతంగా టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. కానీ.. ఆర్థిక ఇబ్బందులతో భార్యాభర్తల మధ్య వివాదాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరుగగా.. భార్య ప్రవంతి పుట్టింటికి వెళ్లింది. బుధవారం తెల్లవారుజామున తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి వేణుకుమార్‌రెడ్డి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు కారణం అత్త, భార్య, మరదలు అని వారి పేర్లు గోడపై రాశాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వచ్చి మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుడి బంధువులకు అప్పగించారు. అంత్యక్రియలకు వెళ్లిన భార్యాపిల్లలను మృతుడి బంధువులు అడ్డుకోవడంతో స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

సీనియర్ సిటిజన్ యాక్ట్‌ను వినియోగించుకోవాలి

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి చందన

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్

రామన్నపేట, ఆగస్టు 21 : సీనియర్ సిటిజన్ యాక్ట్‌ను వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.ప్రదీప్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.చందన అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తల్లిదండ్రులను పోషించని కొడుకు, కూతుర్లపై చట్టపరంగా కేసు వేసి మెయింటెనెన్స్ గానీ, గృహ వసతి, వైద్య ఖర్చులను గానీ తీసుకోవాలన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు యాపల కృష్ణారెడ్డి, ఎండీ మజీద్, మామిడి వెంకట్‌రెడ్డి, నకిరేకంటి మొగలయ్య, సత్తయ్య, డేవిడ్, ప్రభాకర్, హన్మంతు, జగతయ్య, సూపరింటెండెట్లు నారగోని గంగాభవాని, బాలగోని శివరాజు పాల్గొన్నారు.

జూలూరు రోడ్డుకు నిధులు కేటాయించాలి

- డిప్యూటీ సీఎం భట్టికి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి వినతి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 21 : మండలంలోని పిలాయిపల్లి నుంచి జూలూరు రోడ్డుకు నిధులు కేటాయించాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను బుధవారం హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. మండల అభివృద్ధిలో భాగంగా అంగన్‌వాడీ భవనాల నిర్మాణంతోపాటు రోడ్ల అభివృద్ధికి, పంచాయతీరాజ్ రోడ్లకు నిధులు కేటాయించాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్ ఉన్నారు.

మూసీ పరీవాహక ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సంగెం వద్ద మూసీ ప్రవాహాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

వలిగొండ, ఆగస్టు 21 : మూసీ నది పరీవాహక ప్రాంతంలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. మండలంలోని భీమలింగం కత్వ వద్ద సంగెం గ్రామ సమీపంలో మూసీ నదిపై ఉన్న లోలెవల్ వంతెనను రెవెన్యూ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు మూసీకి వరద పోటెత్తే ప్రమాద సమయాల్లో నదికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. రాక